ప్రజాశక్తి

శుక్రవారం 16 డిసెంబరు 2022 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



విజయవాడలో జరిగిన భారీ ప్రదర్శన దృశ్యం; లేబర్ కోడ్‌లు తమకు ఉరితాడుగా ఉన్నాయని సూచిస్తూ వినూత్న ప్రదర్శన, ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం టోకుగా అమ్మేస్తున్నట్లుగా తోపుడు బండిపై నమూనాల ప్రదర్శన (పైన, కింద అంతర్‌చిత్రాల్లో)

ప్రత్యేక హోదా ద్వారానే రాష్ట్రాభివృద్ధి

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు
- ఎన్‌టిఆర్ జిల్లా 11వ మహాసభ ప్రారంభం
- భారీ ర్యాలీ, బహిరంగ సభ



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు; బహిరంగ సభలో అభివాదం చేస్తున్న నేతలు(కింద అంతర్‌చిత్రంలో)

ప్రజాశక్తి - విజయవాడ, వన్‌టౌన్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం రాజకీయాలకతీతంగా పార్టీలు, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదాతో రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా 11వ మహాసభ ప్రారంభం సందర్భంగా గురువారం విజయవాడలో బహిరంగ సభ, భారీ ప్రదర్శన జరిగాయి. పంజాసెంటర్ నుంచి ప్రారంభమైన ప్రదరశన నెహ్రూ బొమ్మ సెంటర్, కోమల విలాస్, రమణా కూల్‌డ్రింక్స్ షాపు, ఆర్‌ఆర్ అప్పారావు వీధిమీదుగా జెండా చెట్టు వరకు ర్యాలీ సాగింది. ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన వందలాది మంది ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. సిఐటియు పతాకాలను చేబూని ర్యాలీలో ఉత్సామంగా పాల్గొన్నారు. ఈబహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర నాయకులు పి.అజయ్‌కుమార్, కె.ధనలక్ష్మీ, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, జిల్లానాయకులు డివి కృష్ణ, ఎన్‌సిహెచ్ సుప్రజ, ఎ కమల, ఎంవి సుధాకర్, ఎం సీతారాములు, పి.నరసింహారావు, ఇ విజయ్‌ప్రకాష్, బి.సత్యబాబు, ఇవి నారాయణ, ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం ప్రతినిధుల సభ జరిగింది. 33 తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ చట్టం అమలుచేయాలని, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, ప్రసూతి సెలవుల చట్టం అమలు చేయాలని తదితర తీర్మానాలను ఆమోదించింది.

(పూర్తి వివరాలు 4వ పేజీలో)



'నవయుగ'కు సుప్రీంలో చుక్కెదురు

- ఒప్పందం రద్దుపై పిటీషన్ కొట్టివేత
- ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు
- బందరు పోర్టు నిర్మాణానికి లైన్ క్లియర్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

మచిలీపట్నం పోర్టు నిర్మాణ భాగసామ్య ఒప్పందం రద్దుపై నవయుగ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు కొట్టేసింది. బందరు పోర్టు నిర్మాణంపై నవయుగ కంపెనీతో ఒప్పందం రద్దు చేసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి ఆ కంపెనీ కోర్టులను ఆశ్రయిస్తోంది. తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రెండు కోర్టుల్లోనూ నవయుగకు చుక్కెదురైంది. ఆ కంపెనీ వేసిన పిటిషన్లను కొట్టేశాయి. దీంతో బందరు పోర్టు నిర్మాణానికి లైన్ క్లియరైంది. ఈనేపథ్యంలో త్వరలోనే బందరు పోర్టు నిర్మాణ పనులు ప్రారంభానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

బందరు పోర్టు నిర్మాణానికి అవసరమైన 1730 ఎకరాల 32 సెంట్ల సముద్రతీర భూములకు సర్వే నంబర్లు ఏర్పాటు చేసి సరిహద్దులను నిర్ణయించేందుకు సర్వేశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మరోపక్క రోడ్డు, రైలు కనెక్టివిటీకి భూ సేకరణకు కసరత్తు జరుగుతోంది. దీనికి సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనుంది. కృష్ణాజిల్లా బందరు మండలం మంగినపూడి గ్రామంలో 788.07 ఎకరాలు, తవిసిపూడిలో 326.90 ఎకరాలు, గోపువానిపాలెంలో 477.12 ఎకరాలు, కరగ్రహారంలో 138.23 ఎకరాలకు సర్వే నంబర్లు కేటాయించి, సరిహద్దులు

(మిగతా 6లో)

భవానీ దీక్షల విరమణ ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భవానీల దీక్షల విరమణ గురువారం ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుండి భవానీలు తరలివచ్చారు. భవానీ దీక్షాల విరమణను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి రోజున రద్దీ తక్కువగా ఉన్నా శుక్ర, శని, ఆదివారాల్లో రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లను ముందుగానే సమకూర్చాలన్నారు. భవానీలు స్నానమాచరించేందుకు ఘాట్లను ఏప్పటికప్పడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. స్నానమానంతరం వస్త్రాలను నదీలోకి జారవిడుస్తారని, వాటిని ఎప్పటికప్పడు సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్నాన ఘాట్ల వద్ద నిరంతరం గజఈతగాళ్లు ఉండేలా పర్యవేక్షించాలన్నారు. కేశఖండనశాలలో సమర్పించిన తలనీలాలను ఏప్పటికప్పుడు సేకరించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. క్షురకులు ఎటువంటి రుసుము వసులు చేయకుండా పర్యవేక్షించాలన్నారు. గత సంవత్సరం

(మిగతా 6లో)

సోలార్ ప్లాంట్లో విద్యుదుత్పత్తి

- నున్న సబ్ స్టేషన్తో చార్జింగ్
- రోజుకు 4 వేల యూనిట్లు ఉత్పత్తి
- దుర్గగుడికి ఏటా రూ.కోటిపైనే ఆదా

విజయవాడ రూరల్ మండలం పాతపాడు శివారు అప్పారావుపేటలోని సోలార్ పవర్ ప్లాంట్, నున్నలోని విద్యుత్ సబ్‌స్టేషన్ (అంతర్‌చిత్రంలో)



ప్రజాశక్తి - విజయవాడ రూరల్

విజయవాడ రూరల్ మండలం పాతపాడు శివారు అప్పారావుపేటలోని సోలార్ పవర్ ప్లాంట్లో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. నాలుగేళ్ల క్రితం రూ.5 కోట్ల వ్యయంతో ఐదెకరాల దుర్గగుడి భూమిలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ నుంచి రోజుకు సుమారు 4 వేల యూనిట్ల (1 మెగావాట్) విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఇటీవల దుర్గగుడి సోలార్ వనంలోని పవర్ ప్లాంట్ నుంచి విద్యుదుత్పత్తి ట్రయల్ రన్ నిర్వహించి ప్లాంట్‌ను నున్నలోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్తో చార్జింగ్ చేశారు. ఈనెల ఐదో తేదీ నుంచి ఇప్పటి వరకు సుమారు 11 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగింది. దుర్గగుడికి సంబంధించిన ఆలయాలలో పెద్దమొత్తంలో విద్యుత్ వినియోగం జరుగుతుండటంతో ఏటా కోటి రూపాయలకుపైగానే బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. నాలుగేళ్ల విరామం తర్వాత సోలార్ పవర్ ప్లాంట్ వినియోగంలోకి రాగా, ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభానికి ముందే ప్లాంట్‌కు ప్రారంభోత్సవం చేయాలని దుర్గగుడి అధికారులు అంచనా వేశారు. అధికారికంగా ఇంకా ప్రారంభించలేదు. ఇదిలా ఉండగా, ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక విద్యుత్ అభివద్ధి సంస్థ (ఎన్‌ఆర్‌ఆఈడీసీఏపీ) 20 శాతం సబ్సిడీతో దుర్గగుడికి సోలార్ ప్యానళ్లను సమకూర్చింది. ఇందుకోసం ఆ సంస్థతో దుర్గగుడి ఒప్పందం కూడా కుదుర్చుకుంది. విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైనప్పటి నుంచి పదేళ్లపాటు ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను హైదరాబాద్‌కు చెందిన సన్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్‌కు అప్పగించారు. సగటున రోజుకు 4 వేల యూనిట్ల చొప్పున ఏడాదికి సుమారు 16 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి జరుగుతుందని అధికారులు తెలిపారు. దుర్గగుడి ఏటా సుమారు 13 లక్షల యూనిట్ల విద్యుత్‌కు రూ.కోటి వరకు బిల్లు చెల్లిస్తోంది. సోలార్ పవర్ ప్లాంట్ వినియోగంలోకి రావడంతో ఏడాదికి దుర్గగుడికి రూ.12 లక్షలపైనే అదనపు ఆదాయం సమకూరనున్నట్టు అధికారులు తెలిపారు. పది రోజులుగా సోలార్ ప్లాంట్లో ఉత్పత్తి అవుతున్న విద్యుత్, నేరుగా నున్నలోని సబ్‌స్టేషన్‌కు చేరుతోంది. ఇలా ప్రతి నెలా దుర్గగుడి విద్యుత్ వినియోగం, పవర్ ప్లాంట్లోని ఉత్పత్తి అయిన విద్యుత్‌ను లెక్కించి, అదనంగా ఉన్న విద్యుత్‌ను ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం చెల్లించి ఏపీసీపీడీసీఎల్ కొనుగోలు చేస్తుందని అధికారులు తెలిపారు.

పాఠశాల విలీనంపై వినతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కాచవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను నిబంధనలను విరుద్ధంగా విలీనం చేస్తున్నారని, ఎప్పటినుండో తమ పిల్లలు చదువుకున్న స్కూల్ని విలీనం చేయడం తగదని ఇబ్రహీంపట్నం మండల అధికారి రామకృష్ణనాయక్‌కు తల్లిదండ్రులు బుదవారం వినతిపత్రం అందజేశారు. కేతనకొండ గ్రామంలో ఇతర పాఠశాలలు ఉన్నా విలీనం చేయకుండా కేవలం కాచవరం ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నో సంవత్సరాల నుండి ఉన్న స్కూల్‌లో పిల్లలు చదువుతున్నారని ఇప్పుడు విలినం చేస్తే పిల్లలు దూరం వెళ్లి ఎలా చదువుతారని ప్రశ్నించారు. గతంలో పాఠశాల విలీనం చేయకుండా తీర్మానం చేశామని, అందుకు అందరు ప్రజాప్రతినిధులు మద్దతు తెలిపారని ఇప్పుడు ఆకస్మాత్తుగా విలీనం చేయడం తగదన్నారు.

జడ్‌పి పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక కెవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో



మండలంలోని ఏడు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలు బాలుర పాఠశాల నుంచి హోలోగ్రామ్, బాలికల పాఠశాల నుంచి మూడు కుండల పద్ధతి, ముండ్లపాడు హైస్కూల్ నుంచి ఆహారం ద్వారా ఆరోగ్యం, మేథమేటిక్స్ లో కొణకంచి హైస్కూల్, అనిగండ్లపాడు నుంచి బిందు సేద్యం జిల్లా స్థాయిలో ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, పొడుగు శ్రీనివాసరావు, ముక్కా సత్యనారాయణ, బి వెంకటేశ్వరరావు,మురళీకష్ణ, ప్రసాద్, సరస్వతి, నాగజ్యోతి, చంద్ర, దానయ్య, సిఆర్పి గోపాల్, బాబు, తులసి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

కెడిసిసిబి భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గంపలగూడెం: సహకార బ్యాంకుల సేవలతోనే రైతు ఎదుగుదల ఆధారపడి ఉంటుందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి తెలిపారు. గంపలగూడెం లో నూతనంగా 1.74 కోట్లతో నిర్మించనున్న కేడీసీసీ బ్యాంక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన గురువారం సాయంత్రం చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే రక్షణ నిధి మాట్లాడుతూ గంపలగూడెం మండలంలో 30 శాఖలతో రైతులకు మేలుకరమైన సేవలు అందించుటతో పాటు బ్యాంకు ఎదుగుదల దినదినాభివద్ధి చెందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ఇప్పటికే 8 సొసైటీ భవనాలకు శంకుస్థాపన చేసి నాలుగు భవనాలు పూర్తి చేసినట్లు తెలిపారు. మండలానికి జిల్లా బ్యాంకు నుండి ఆరుకోట్ల 50 లక్షలు రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు నాగేశ్వరావు వివరించారు. ఈ బ్యాంకు ద్వారా రుణాలు పొంది మరింత వద్ధి చెందాలని కోరారు. కమర్షియల్ బ్యాంకులు ఎకరాకు లక్ష ఇస్తుంటే సహకార బ్యాంకులో ఎనిమిది లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు వివరించారు. ఈ బ్యాంకు నిర్మాణంపై తెలుగుదేశం పార్టీ నాయకులు అవాకులు చవాకులు రాయచడాన్ని తన్నీరు తప్పు పడుతూ ఈ స్థల సేకరణలో ఎమ్మెల్యే ప్రమేయం ఏమాత్రం లేదని ఖండించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సర్పంచ్ కోట పుల్లమ్మ, ఎంపీపీ శ్రీలక్ష్మి, జడ్పిటిసి సామ్యూల్, ఎంపీటీసీలు కొత్త గుండ్ల లావణ్య, పి రజని పాల్గొన్నారు

'పాత పింఛను విధానాన్ని కొనసాగించాలి'

ప్రజాశక్తి-తిరువూరు: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని కోరుతూ యుటిఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో



తిరువూరులో త్రికే రన్ నిర్వహించి బోసుబొమ్మ సెంటర్‌లో సదస్సు నిర్వహించారు. ఇటీవల హర్యానాలో కాంగ్రెస్ పార్టీ గెలవటానికిపాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీనివ్వడమేనని అన్నారు. జగన్ కూడా ఇచ్చిన హామీని నిలబుట్టుకోవాలని, లేదంటే రానున్న ఎన్నికల్లో చావుదెబ్బ తినాల్సివస్తుందనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కృష్ణసుందరరావు, ఎం.శ్రీనివాసరావు, డి.అపర్ణ, ఎన్.వెంకటేశ్వర్లు, రాయల వినయ్‌కుమార్, జెవివి నాయకులు ఎం.నాగేంద్ర ప్రసాద్, రైతు సంఘం నాయకులు సాంబారు వెంకటేశ్వర్లు, ఎన్జీవో అధ్యక్షులు మాతంగి ప్రకాష్ బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం వైసిపి నేతలతో సిఎం భేటీ



సిఎం సమావేశానికి హాజరైన నాయకులు

ప్రజాశక్తి-మైలవరం: నిన్న, మొన్నటి వరకు మైలవరం ఎంఎల్ఏ సీటు విషయంలో మంత్రి జోగి, వసంతలకు ఎవరికి వస్తుందనే నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా చర్చనియాంశమైంది. ఈ నేపథ్యంలో మైలవరం వైసిపి నేతలతో సిఎం జగన్ తన క్యాంప్ కార్యాలయంలో గురువారం బేటి అయ్యారు. గత కొంతకాలంగా స్థానిక ఎం.ఎల్ ఎ వసంతకు, మంత్రి జోగి రమేష్‌కు పొసగటంలేదు. నాయకులు, కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయి, సోషల్ మీడియాలో దుమ్మెత్తి పోసుకుంటున్నారు.2014లో బి.సి నేత అయిన జోగి రమేష్‌కు వైసిపి టికెట్ కేటాయించింది. జోగి ఓటమి చెందారు. మరలా 2019లో జోగిని కాదని నందిగామ నియోజకవర్గానికి చెందిన వసంతకు సీటు ఇచ్చారు. వసంత మాజీ మంత్రి దేవినేనిపై గెలుపొందారు. ఇటీవల రెండవ దఫా జరిగిన మంత్రి వర్గ విస్తర్ణలో జోగి రమేష్‌కి మంత్రి పదవి దక్కింది. అప్పటి నుండి జోగి 2024లో ఎలాగైనా మైలవరం సీటును దక్కించుకోవాలని చాపకింద నీరులా ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎం.ఎల్.ఎ వసంత గడప గడపకు కార్యక్రమానికి పుల్‌స్టాప్ పెట్టి, సజ్జలకు విషయాన్ని వివరించారు.జోగి రమేష్ కూడా సజ్జలను కలసి విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సి.యం జగన్ నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమావేశం అయ్యారు. ఒక్కొక్కరికి 2ని॥లు మాట్లాడే సమయం కేటాయించినట్లు సమాచారం. అందరూ మాట్లాడిన అనంతరం సి.యం జగన్ మాట్లాడుతూ 2024లో 175కు 175సీట్లు గెలవాలని, మైలవరంలో వసంత, పెడనలో జోగి రమేష్‌లు అత్యంత మెజారిటీతో గెలుస్తారని, ఎవరి పని వారు చేసుకోవాలని, ఇద్దరి మధ్య తాను ఫెవికల్‌లా వుంటానని, ప్రసాద్‌కు జోగి రమేష్ పూర్తిగా సహకరిస్తాడని నాయకులు, కార్యకర్తలతో అన్నట్లు సమాచారం.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ వైసిపి ఆధ్వర్యంలో గురువారం సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్ సోదరి వైఎస్ విమలమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. తొలుత నందిగామలో క్రిస్టియన్ కమ్యునిటి హాల్ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఎంఎల్ఎ మొండితోక జగన్మోహనరావు, ఎంఎల్సి మొండితోక అరుణ్‌కుమార్, ఎం.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రెండు వేల మంది పాస్టర్స్‌కు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిఫ్ అధ్యక్షులు బొక్కా జార్జి ముల్లర్, జిడిఎంఎం ఇంజనీరింగ్ కాలెజి అధినేత డాక్టర్ జి.వి.ప్రసాదరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం:** ఈలప్రోలు మహిమ పెంతెకొస్తు సంఘస్థులు పాపట్ల సురేష్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కళా వేదిక వద్ద బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు



ఘనంగా నిర్వహించారు. కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎం.ఎలీషా, ఇబ్రహీంపట్నం మహిమ పెంతెకొస్తు డైరెక్టర్ అండ్ ఫౌండర్ బిషప్ రెవరెండ్ డాక్టర్ బూరుగు, ఇబ్రహీంపట్నం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ పాస్టర్ ఎం.శ్యాంసుందర్, పాస్టర్ దొప్పల సుబ్బారావు, పాస్టర్ ఎం.సమూయేలు హాజరై క్రిస్మస్ సందేశాలిచ్చారు.

సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ప్రచారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ సరికొత్తగా స్పోర్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను ప్రచారం చేస్తుందని సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ హెడ్ రాజేష్ కౌల్ ఒక ప్రకటనలో తెలిపారు. అగ్ర స్పోర్ట్స్ బ్రాండ్ అయిన డబ్ల్యు.డబ్ల్యూ. ఈ సంస్థను విస్తృతస్థాయిలో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా స్పోర్ట్స్ పట్ల ఆసక్తి ఉన్న ప్రేక్షకుల కోసం ప్రతిక్షణం స్పోర్ట్స్ కార్యక్రమాలను అందించేందుకు సోనీ నెట్‌వర్క్ వివిధ వ్యక్తులు, సంస్థలతో పెద్ద ఎత్తున ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెగా స్పోర్ట్స్ స్టార్ జాన్ జాన్ అబ్రహం, కార్తీతో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్విమ్మింగ్ విజేతలకు సన్మానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఇటీవల హైదరాబాదులో ఆక్వాటిక్ మాస్టర్స్ ఆంధ్ర, తెలంగాణ సంయుక్తంగా నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో కృష్ణ స్విమ్మర్స్ సభ్యులు చిట్యాల మోహన్‌రావు 55, 59 విభాగంలో 50 మీటర్లలో బటర్ ఫ్లై, బెస్ట్ స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్, ఫ్రీ స్టైల్‌లో నాలుగు స్వర్ణాలు గెలుచుకున్నారు. రాయల సత్యనారాయణ 100 మీటర్ల విభాగంలో బటర్ ఫ్లై, బ్యాక్ స్ట్రోక్, ఫ్రీ స్టయిల్ మూడు గోల్డ్ మెడల్స్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కష్ణ స్విమ్మర్స్ ఆధ్వర్యంలో విజేతలకు గురువారం సన్మానం చేశారు. కష్ణ స్విమ్మర్స్ పెద్దలు స్టాలిన్, కృపాకర్, మహేష్ వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పిన్నెల్లి పాండురంగారావు, సెక్రటరీ తేజావత్ కోటేశ్వరరావు, కోశాధికారి హుస్సేన్ పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ కోటిలింగం వర్ధంతి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నిత్యం ప్రజలతో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుంటే వ్యక్తి మాజీ కార్పొరేటర్ శీలం కోటిలింగం అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ శీలం కోటిలింగం 31వ వర్ధంతి సభ పటమటలకంలోని సీపీఎం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ , కోటిలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాశీనాథ్ మాట్లాడుతూ కోటిలింగం యువజన ఉద్యమంలో నుండి చురుకుగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారన్నారు. విద్యాధరపురంలో కార్పొరేటర్‌గా గెలిచి అభివృద్ధి నోచుకోని ప్రాంతాన్ని అభివృద్ధి చేశారన్నారు. తరువాత అప్పటి 46వ డివిజన్ ప్రాంతం ఇప్పటి రామలింగేశ్వరనగర్‌లో మరలా రెండోసారి కార్పొరేటర్‌గా గెలిచారన్నారు. ఎక్కువగా కార్మికులు నివసించే ఈప్రాంతంలో నిత్యం ప్రజలలో కలసి తిరుగుతూ ఎవరికి ఏసమస్య వచ్చినా వెంటనే స్పందించేవారన్నారు. ఆయన నిజాయితీ, నిబద్ధత గురించి ఇప్పటికీ ప్రజలు చర్చించుకుంటున్నారనా ఆయన నిజాయిదీని నిదర్శనమని తెలిపారు. ఆయన పేరుతో శీలం కోటిలింగం స్మారక గ్రంథాలయం ఏర్పాటు చేసి నడుపుతున్నామని భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రంథాలయ ఆవశ్యకత అంశంపై స్థానిక విఎంసి స్కూల్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందచేశారలు. ఈ కార్యక్రమంలో తూర్పు నగర కార్యదర్శి బోజెడ్ల నాగేశ్వరరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు పుప్పాల కృష్ణ, నగర కమిటీ సభ్యులు గురుమూర్తి, వరప్రసాద్, చంద్రశేఖర్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాశీనాథ్

మండల కేంద్రం మార్పుపై నిరసన

ప్రజాశక్తి-వీరులపాడు: వీరులపాడు మండల కేంద్రం మార్పుపై గ్రామస్తులు గురువారం నిరసన తెలిపారు. వీరులపాడు మండలాన్ని జుజ్జూరు తరలించడాన్ని వ్యతిరేకించారు. 36 సంవత్సరాల క్రితం ఏర్పడ్డ మండలాన్ని ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న మండలంలో చిచ్చుపెట్టారని విమర్శించారు. గ్రామాల మధ్య ఘర్షణ చోటుచేసుకునేలా నిర్ణయం తీసుకోవడం అమానుషమన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు కోట్ల రూపాయలతో నిర్మించి ఇప్పుడు మండలాన్ని జుజ్జూరు తరలించడం సమంజసం కాదన్నారు.

నవరత్నాలతో పేదలందరికీ మేలు : రక్షణనిధి

ప్రజాశక్తి-ఎ.కొండూరు: నవరత్నాలతో పేదలందరికీ ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని పాల్తియ తండా ఎల్ఐజి కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఎలా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల వెంకట సీతమ్మ, వైకుంఠరావు, ఎంపీటీసీ సభ్యురాలు మారిపోగు అనూష, మహేష్, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, చెన్నారావు, జడ్పిటిసి భూక్య గనియ, వజ్రాల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి : ఎంఎల్‌సి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని ఓసి క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ గురువారం సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. ఉచిత కోచింగ్ సెంటర్‌ను వినియోగించుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులు పట్టుదలతో నిరంతరం సాధన చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కెవిఆర్ కళాశాల అధ్యాపకులు వాసుదేవరావు, నాని, పిజేఆర్ కోచింగ్ సెంటర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

సహకార భవనం ప్రారంభం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: రైతులకు సొసైటీలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. మండల పరిధిలోని గుమ్మడిదూరు గ్రామంలో 22 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి వ్యవసాయంతో పాటు అన్ని సహకార రంగాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, గ్రామ సర్పంచ్ నక్క కమల, ఎంపీపీ మార్కాపుడి గాంధీ, పెనుగంచిప్రోలు గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్ పరిశీలన

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను మండల విద్యాశాఖ అధికా రి సోమశేఖర్ నాయక్ ప్రధానోపాధ్యా యిని నాగ కుమారితో కలిసి గురువారం పరిశీలించారు. వివిధ సందేశాత్మ కంగా మోరల్స్ ను తయారు చేసిన విద్యార్థులను ఎంఇఓ అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని లావణ్య పరిశుభ్రత అంశంలో ప్రథమ, చరిష్మా కాలుష్యం అనే అంశంలో తృతీయ మునకుళ్ళ పాఠశాల విద్యార్థిని స్వప్న ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు భరతకుమారి, వీణా ధరి, ధనలక్ష్మిరాణి, నల్లగట్ల శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారంనాడు సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. పలువురు పాస్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని కేకును కట్‌చేశారు. కోడూరు : మండల పరిధిలోని దింటిమెరక గ్రామంలో సర్వశక్తుని ప్రార్ధనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పర్ణశాల ఫెలోషిప్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పాస్టర్ కోలా దానియేలు దేవుని సందేశాన్ని విశ్వాసులకు వినిపించారు. క్రీస్తు జనన సందేశాన్ని బ్రదర్ పి.రాజు వివరించారు. తొలుత సుమధుర గీతాలను విశ్వాసులు ఆలపించారు. పాస్టర్ కోలా దానియేలు-పరంజ్యోతి దంపతుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం విశ్వాసులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ కోలా కృపావరం, ఎం.శివరామకృష్ణ, విశ్వాసులు పాల్గొన్నారు. **గుడివాడ :** టిడిపి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు టిడిపి దళిత నాయకులు తెలిపారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు విలేకర్ల సమావేశంలో దళిత టిడిపి నాయకులు కంచర్ల సుధాకార్, అసిలేటి నిర్మల, దాసు శ్యామ్‌కుమార్, పులవర్తి డేవిడ్, మొందు జోజిబాబు, బాలసాని భవాని మాట్లాడారు. శుక్రవారం స్థానిక రైల్వే కమ్యూనిటీ హాల్లో సాయంత్రం 6 గంటలకు టిడిపి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అధ్యర్యలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుగుతాయన్నారు. **అవనిగడ్డ :** పంచాయతీ పరిధిలోని బందలాయి చెరువు గ్రామంలోని ఆర్‌సిఎం చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో చిన్నారి బాల యేసు ప్రతిమను ఎత్తుకొని కీర్తనలు ఆలపిస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అవనిగడ్డ కోటగిరి లంక ఆర్‌సిఎం చర్చి విచారణ గురువు సురేష్ మెర్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. సంఘ పెద్దలు గోరుముచ్చు కోటేశ్వరరావు, దాసు రవీంద్ర హారి బాబురావు, ఉపదేశి రాజు తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా స్థిరపడుతుందని వెనిగండ్ల ఫౌండేషన్ అధినేత వెనిగండ్ల రాము అభిప్రాయపడ్డారు. గురువారం గుడ్లవల్లేరు మండలం చంద్రాల, ఆర్. సి. ఏం కవతవరంలలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలలో రాము వెనిగండ్ల పాల్గొన్నారు. వేడుకలలో భాగంగా కేక్ కట్ చేసి పంపిణి చేశారు. నూతన వస్త్రాలు వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.



కోడూరులో



అవనిగడ్డలో



గుడ్లవల్లేరులో

నాణ్యమైన విద్యుత్‌ను అందించటమే లక్ష్యం

పమిడిముక్కల ఎఇ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పమిడిముక్కల

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించటమే లక్ష్యంగా కృషిచేస్తున్నామని విద్యుత్‌శాఖ పమిడిముక్కల మండల ఎఇ శ్రీనివాసరావు అన్నారు. ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పంచాయతీల నుంచి విద్యుత్‌శాఖకు రావాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించాలని కోరారు. నిరంతరం వినియోగదారులకు నాణ్యమైన కరెంటు ఇస్తున్నామని చెప్పారు. కృష్ణాపురం, మంటాడ, తాడంకి తదితర గ్రామాల్లో కరెంట్ సమస్యలు ఉన్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కరెంటు వినియోగించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని వినియోగదారులకు సూచించారు. మండలంలో ఏమైనా సమస్యలు వస్తే విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు.



రైతులకు పరిహారం అందించాలి

ప్రజాశక్తి-కోడూరు

తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని సిపిఎం కోడూరు మండల కార్యదర్శి పోలాబత్తిన మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి, నారేపాలెం, సాలెంపాలెం గ్రామాలలో సిపిఎం నాయకులు గురువారం పర్యటించి పొలాల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాండూస్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. సబ్సిడీపై మినుము విత్తనాలు ఉచితంగా అందించాలని కోరారు. సిపిఎం నాయకులు కొప్పనాతి తాతయ్య, దిడ్ల.వెంకటేశ్వరావు, రైతులు కొప్పుల ఏడుకొండలు, మెండు బ్రహ్మయ్య, బావిశెట్టి వీర



కొండలు, ముళ్ళపూడి శంకర్రావు, కోట ఆదినారాయణ, మద్దాల సుజాత తదితరులు పాల్గొన్నారు. **పమిడిముక్కల :** త ం ఎ. ా న్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు పరిహారం అందించి పూర్తిస్థాయిలో ఆదుకోవాలని ఎపి కౌలు రైతుసంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి కె.శివనాగేంద్రం రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. పమిడిముక్కల మండలంలోని హనుమంతపురం, పమిడిముక్కల, కృష్ణాపురం తదితర గ్రామాల్లో గురువారంనాడు ఆయన పర్యటించారు. వరి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

80 శాతం సబ్సిడీపై విత్తనాలు : జెసి

మోపిదేవి : వరి కోతలు కోసి పంట పనుల మీద ఉన్న రైతులకు రెండో పంటకు మినుము విత్తనాలు 80 శాతం సబ్సిడీపై సరఫరా చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ వెల్లడించారు. మండల పరిధిలోని కోసూరివానిపాలెంలో గురువారం ఆమె పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు.



పంటలను పరిశీలిస్తున్న జెసి, అధికారులు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంట కోత కోసి పనలపై ఉన్న విస్తీర్ణాన్ని, కోత కోయక ముందే పడిపోయిన వరిచేలు పంట నష్టం అంచనాల రూపొందించాలన్నారు. ప్రభుత్వం నుంచి పంట నష్టం రైతులకు అందేవిధంగా తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గత వారం రోజులుగా పనలపై తడిసిపోతు పాడైపోతున్న వరి ధాన్యాన్ని మిల్లర్లు ఉదారంగా కొనుగోలు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ మోహన్ రావు, వ్యవసాయ శాఖ అవనిగడ్డ అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ పద్మ, మోపిదేవి తహశీల్దార్ కె.నవీన్ కుమార్, ఎంపీడీవో డి.పార్వతి, వ్యవసాయ శాఖ ఏవో శ్రీనివాస కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో టిడిపి నిరసన

అవనిగడ్డ : గత మే నెల 23న దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను ఎమ్మెల్సీ అనంత బాబు కాకినాడలో అతి దారుణంగా చంపాడనీ, అనంత బాబుకు బెయిల్ ఇవ్వడాన్ని నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. గురువారం టిడిపి నాయకులు సీతాలంకలోని అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ అనంతబాబుకు బెయిల్ ఇవ్వడమే కాకుండా జైలు నుండి ఊరేగింపుగా తీసుకెళ్లటం సిగ్గుచేటని పేర్కొన్నారు. నరహంతకులను కఠినంగా శిక్షించాలని తక్షణమే బెయిల్ రద్దుచేసి అనంత బాబును జైల్లో పెట్టాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్ర సుధాకర్, రావి రత్నగిరి, మాచవరపు ఆదినారాయణ, మాతంగి జనార్ధన్, గుంటూరు వినయ్, పుట్టి శ్రీను, సిరివెళ్ల పుల్లారావు, దాసినేని శ్రీనివాసరావు, పులి గడ్డ నాంచారయ్య, మొగల్ మురద్, చెన్ను బాబూరావు, మెగావత్ గోపి, కోట సాయి, మీసాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మూడో వార్డులో గురువారం ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా రెండు కళ్ళుగా చూస్తూ పాలన సాగిస్తోందన్నారు. కీర్తిశేషులు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను పుణికి పుచ్చుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలందరికీ పార్టీలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఆరోగ్యం, విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు ప్రవేశపెట్టి పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, వైసిపి అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైసిపి మండల కన్వీనర్ రేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు తోట గణేష్, ఉప సర్పంచ్ గాజులు జై గోపాల్, కోడూరు సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, ట్రేడ్ యూనియన్ నాయకులు గార్లపాటి గోపి, శ్రీలంకమ్మ అమ్మవారి టెంపుల్ శివాలయం చైర్మన్లు చింతలపూడి బాలు, సింహాద్రి రామనాథ్ బాబు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌భాబు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో కార్యాలయాన్ని మాచవరం మెట్టు పెడన మెయిన్ రోడ్డులో పెట్రోల్ బంకు పక్కనే ఉన్న యారా జగన్ మోహన్ రావు రాష్ట్ర పెన్షనర్స్ విభాగం సభ్యుల స్థలంలో గురువారం ప్రారంభించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు, తాలూకా అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. వి సీతారామయ్యను జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎపిజిఇఎ రాష్ట్ర అధ్యక్షులు కె ఆర్ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఆస్కారావు నియమించారు. మచిలీపట్నం తాలూకాకు కె.శ్రీనివాసరావు వైస్ ప్రెసిడెంట్, పివి రవీంద్రబాబు జాయింట్ సెక్రటరీ, ఎండి సలీం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగాను, మహిళా విభాగం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గా పి శైలజ, జిల్లా కార్యదర్శిగా షేక్ జహీరున్నీసాబేగం, వైస్ ప్రెసిడెంట్‌గా లిల్లీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు పి.రాము అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి తోట వర ప్రసాద్ , కోశాధికారి పాండురంగ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌లు సురేష్, శ్రీనివాస్, బాలాజీ , మహేష్, జాయింట్ సెక్రేటరీలు రామారావు, సత్యనారయణ, సాయి రామ్, శివరామకృష్ణ పాల్గొన్నారు.



యాసం చిట్టిబాబు ఆర్థిక సాయం

అవనిగడ్డ : ఇటీవల పంచాయతీ పరిధిలోని మూడో వార్డులో ఇల్లు కాలిపోయిన అవనిగడ్డ శ్రీనివాసరావు కుటుంబానికి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు రూ.10 వేలు సహాయం అందజేశారు. గురువారం ఆ కుటుంబాన్ని కలసి ఈ సహాయాన్ని శ్రీనివాసరావుకు అందజేయడంతో పాటు నూతన గృహ నిర్మాణ సందర్భంగా విద్యుత్ వైరింగ్ సామాన్లు కూడా అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, గుడివాక నాగ మల్లికార్జునరావు, బర్మా శ్రీనివాసరావు, పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఘంటసాల కన్నయ్య, గుడివాక నరహరి, అవనిగడ్డ శ్రీనివాసరావు, మోపిదేవి కోటేశ్వరరావు, అవనిగడ్డ రవి, అవనిగడ్డ బ్రహ్మయ్య, శివరామకృష్ణ, కరుణాకర్, శివకుమార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

అవనిగడ్డ : కోడూరు మండలం మాచవరం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన బాధితులను అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాల వద్ద శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పరామర్శించారు.

ప్రత్యేక హోదా ద్వారానే రాష్ట్రాభివృద్ధి

• సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు • ఎన్‌టిఆర్ జిల్లా 11వ మహాసభ ప్రారంభం : • భారీ ర్యాలీ, బహిరంగ సభ

ప్రజాశక్తి-విజయవాడ: ప్రత్యేక హోదా ద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, దాని సాధన కోసం రాజకీయాలకతీతంగా ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా 11వ మహాసభ సందర్భంగా వన్‌టౌన్ పంజాసెంటర్ నుంచి జెండా చెట్టు వరకు ర్యాలీ గురువారం నిర్వహించారు. అనంతరం అక్కడ బహిరంగ సభ జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో నర్సింగరావు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా చట్టం చేయబడిన ప్రత్యేక హోదాను గత ఏడేళ్ల నుంచి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. రాబోయేది పోరాటాల సంవత్సరమన్నారు. జనవరి 2, 3, 4 తేదీల్లో సిఐటియు రాష్ట్ర మహాసభలు భీమవరంలో జరుగుతున్నాయని, ఆ మహాసభలో రాబోయే కాలంలో నిర్వహించబోయే దశలవారీ పోరాటాలపై దిశనిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో కార్మికులు, కష్టజీవులు, ఆయా తరగతుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న విధానాలు, పతనావస్థలో ఉన్న ఆర్థిక వ్యవస్థే కారణమన్నారు. కార్పొరేట్ల అనుకూల విధానాలను అమలు చేస్తూ ధరల భారాన్ని ప్రజలపై మోపుతున్నారన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు వల కార్మిక హక్కులకు రక్షణ లేకుండా పోతున్నాయని పేర్కొన్నారు. రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో వాటి రద్దుకు పోరాడాలని కోరారు. ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరైన కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తోన్న విధానాలపై కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కనీస వేతనాలను సవరించి 15 ఏళ్లయిందని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కారు చౌకగా ప్రయివేటు వారికి కట్టబెట్టడం, చివరకు రోడ్లు, మౌలిక వసతులు, సహజ సంపదలను లీజుకివ్వడం వంటి విధానాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలోని శ్రామిక మహిళలు, స్కీమ్ వర్కర్లు కరోనా కాలంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఎంతో సేవలు అందించారని, అటువంటి వారికి సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలను ఈ ప్రభుత్వాలు తీసివేయడం దుర్మార్గమైన చర్య అని ధ్వజమెత్తారు. వీరికిచ్చిన హామీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలనే రాష్ట్రంలోని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా అమలు పరుస్తుందని విమర్శించారు. రాబోయే కాలంలో ఈ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడి తగిన గుణపాఠం చెప్పాల్సి ఉందన్నారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు డివి కృష్ణ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ జిల్లాలోని ఆయా రంగాల్లో పనిచేస్తున్న కార్మికవర్గం అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి సాధన కోసం రాజీలేని పోరాటం చేయాల్సి ఉందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే రెండేళ్ల పాటు జిల్లాలో నిర్వహించబోయే పోరాటాలను మహాసభలో రూపొందిస్తామన్నారు. ముఠా కార్మికుల దగ్గర నుంచి ఆటో, ఆశా, ఇతర రంగాల్లోని ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశామని వివరించారు. సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి అజయ్‌కుమార్, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఎన్‌సిహెచ్ సుప్రజ, ఎ కమల, ఎంవి సుధాకర్, ఎం సీతారాములు, పి నరసింహారావు, ఇ విజయ్‌ప్రకాష్, బి సత్యబాబు, ఇవి నారాయణ, ఎం మహేష్ పాల్గొన్నారు.


సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న ఎంఎన్ పాత్రుడు


అమరులైన కార్మిక నేతలకు నివాళులర్పిస్తున్న నర్సింగరావు


మహాసభకు హాజరైన వివిధ రంగాల ప్రతినిధులు


గేయాలు ఆలపిస్తున్న పిఎన్ఎం కళాకారులు అనిల్‌తదితరులు


ర్యాలీ ముందు భాగాన భారీ పతాకాలు



వన్‌టౌన్ పంజా సెంటర్ నుంచి ర్యాలీ


విద్యాసాగర్


ధనలక్ష్మి


శ్రీనివాస్


సత్యబాబు


కమల


డివి కృష్ణ


నారాయణ


వెంకటేశ్వరరావు


సుప్రజ



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



వ్యవస్థ మార్పు ద్వారానే కార్మిక సంక్షేమం

సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా మహాసభలో అజయ్‌కుమార్

ప్రజాశక్తి-విజయవాడ: వ్యవస్థ మార్పు ద్వారానే ఉద్యోగ, కార్మిక, కర్షక కష్టాలు తీరుతాయని, అందుకు అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని సిహెచ్.శ్రీలక్ష్మి నగర్ (మాడపాటి క్లబ్)లో రెండు రోజుల పాటు జరగనున్న సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా 11వ మహాసభలో తొలిరోజు జరిగిన ప్రతినిధుల సభకు ఎ.వెంకటేశ్వరరావు, కె.దుర్గారావు, ఎం.సీతారాములు, ఎన్‌సిహెచ్ సుప్రజ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సభనుద్దేశించి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల సమస్యలపైనే కాకుండా వ్యవస్థ మార్పు కోసం ఉద్యమాలను విస్తరించాల్సి ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాల వల్ల 90 శాతం మంది కార్మికులకు పని భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వామపక్ష పాలనలో ఉన్న కేరళ రాష్ట్రంలో పని భద్రతతో పాటు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు, సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఆ రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ.100 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ఒక రాష్ట్రంలో కార్మిక అనుకూల ప్రభుత్వం ఉంటే ఎలా ఉంటుందనే దానికి కేరళ ఒక మోడల్‌గా నిలుస్తుందన్నారు. ఎపిఎస్‌జిఒ సంఘం ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికులకు మెరుగైన వేతనాలు, ఇతర సంక్షేమ పథకాలు ఏమో కానీ...ప్రతి నెలా ఒకటో తేదీన జీతం ఇవ్వాలని అడుక్కునే దైనీయ పరిస్థితికి ఈ రాష్ట్రం నెట్టబడిందన్నారు. పది సంవత్సరాల్లోపు ఆయా రంగాల్లో పని చేస్తున్న 1.50 లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికుల మెడపై కత్తి వేలాడుతుందని, వీరందరినీ ఇంటి దారి పట్టించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. సిఐటియు, ఇతర ఉద్యోగ, కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటాల కారణంగా ప్రస్తుతానికి ప్రభుత్వం ఆగిందని తెలిపారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ లేకుండానే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రద్దు చేస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమైన చర్య అన్నారు. వీటన్నింటికి వ్యతిరేకంగా సిఐటియు చేస్తున్న పోరాటాలకు ఎపిఎన్‌జిఒ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ గడిచిన మహాసభ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో నిర్వర్తించిన పోరాటాల నివేదికతో పాటు భవిష్యత్ కర్తవ్యాలను ప్రవేశపెట్టారు. తొలుత మహాసభ ప్రారంభసూచికగా సీనియర్ నాయకులు ఎంఎన్ పాత్రుడు సిఐటియు జెండాను ఆవిష్కరించారు. సంతాప నివేదికను ఎంవి సుధాకర్ ప్రవేశపెట్టారు. ఈ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డివి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

33 తీర్మానాలు ఆమోదం

ఈ సందర్భంగా 33 తీర్మానాలను ప్రవేశపెట్టగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్మికులకు రూ.26 వేలు ఇవ్వాలని, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ చట్టం అమలు చేయాలని, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, ప్రసూతి సెలవుల చట్టం అమలు చేయాలని తదితర తీర్మానాలను ప్రవేశపెట్టారు.



ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

గృహ నిర్మాణ ప్రగతిలో జిల్లాకు రెండోస్థానం : కలెక్టర్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

గృహనిర్మాణ ప్రగతిలో గడిచిన వారంలో నిర్దేశించిన లక్ష్యానికి గాను కృష్ణాజిల్లా మంచి ప్రగతి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌భాష

సాధించి రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి స్పందన, గృహ నిర్మాణం, జగనన్న స్వచ్ఛ సంకల్పం తదితర అంశాలపై సమీక్షించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్ శర్మ మాట్లాడారు. కష్ణాజిల్లా ప్రగతిని కలెక్టర్ వివరించారు. జిల్లాకు మొత్తం 94,256 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకూ 7,300 గృహాలు పూర్తయ్యాయన్నారు. 78 వేలకు పైగా వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డేలో భాగంగా జిల్లాలో ఇప్పటి దాకా 103 లేఅవుట్లు అధికారులు సందర్శించి సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గృహనిర్మాణ లబ్ధిదారులకు చెల్లింపులు పూర్తి స్థాయిలో చేశామన్నారు. ఈనెలాఖరునాటికి అన్ని లేఅవుట్లలో నూరుశాతం గ్రౌండింగ్ జరగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. స్పందన రీ ఓపెన్ అర్జీల జిల్లాల వారి సమీక్షలో నవంబర్ 30 నుండి ఈనెల ఆరోతేదీ వరకూ 124 అర్జీలు పరిష్కరించగా వాటిలో కేవలం 2 మాత్రమే రీ ఓపెన్ అయ్యాయన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో క్లాప్ మిత్రలకు 93.22 శాతం మందికి రెమ్యూనరేషన్ చెల్లింపులు చేశామన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం క్రింద జిల్లాలో 112 గ్రామాల్లో రీ సర్వే చేపట్టగా 101 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ జారీ పూర్తయ్యిందన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, సీపీవో వై. శ్రీలత, డ్వామా పి డి, హౌసింగ్ పిడి ఇన్చార్జీ జి.వి. సూర్యనారాయణ, జడ్పీ సీఈవో జి. శ్రీనివాసరావు, ఎడి సర్వే గోపాలరాజ్, డి.ఎల్డీవో సుబ్బారావు, ఎస్.ఈ పంచాయతీరాజ్ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-చల్లపల్లి

చల్లపల్లి మండల సర్పంచుల సంఘం నూతన అధ్యక్షులుగా మంగళాపురం గ్రామ సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచుల సంఘం ఎన్నికలు జరిగాయి. సంఘ నూతన అధ్యక్షులుగా మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులుగా వక్కలగడ్డ సర్పంచ్



వల్లూరు ఉమా, ఆముదార్లంక సర్పంచ్ నడకుదుటి ఆదిలక్ష్మి, పురిటిగడ్డ సర్పంచ్ మాతంగి రమ్య, యార్లగడ్డ సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్, పాగోలు సర్పంచ్ తోట శ్రీనివాసరావు, మాజేరు సర్పంచ్ కళ్లేపల్లి లక్ష్మి, నడకుదురు సర్పంచ్ గొరిపర్తి సురేష్ బాబు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమూరి గోవర్ధన్ రావు, పాగోలు ఎంపీటీసీ సభ్యులు మేకా సత్యనారాయణ ప్రసాద్ (బంగారుబాబు) అభినందించి సత్కరించారు.

ఘనంగా జాతీయ గణితశాస్త్ర దినోత్సవం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

భారతదేశ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రాముసుజన్ జయంతి డిసెంబర్ 22 వ తేదీని పురస్కరించుకుని స్థానిక నోబుల్ కళాశాలలో గురువారం జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎంజె శుభకర్ ఆధ్వర్యంలో డాక్టర్ రామానుజన్ చరిత్రపై విద్యార్థులకు వక్తత్వ పోటీలు నిర్వహించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామానుజన్ గణిత శాస్త్ర పరిజ్ఞానం ఆశ్చర్య పర్చేదన్నారు. గణితశాస్త్రంలో నిరంతర భిన్నాలపై అతని నైపుణ్యం జీవించి ఉన్న ఏ గణిత శాస్త్రజ్ఞుడికీ అసమానమైనదని తెలిపారు. అతను రీమాన్ సిరీస్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ , హైపర్‌జోమెట్రిక్ సిరీస్, జీటా ఫంక్షన్ ఫంక్షనల్ ఈక్వేషన్స్, డైవర్జెంట్ సిరీస్ తన స్వంత సిద్ధాంతాన్ని రూపొందించి దానిలో అతను కనుగొన్న సాంకేతికతను ఉపయోగించి సిరీస్ మొత్తానికి విలువను కనుగొన్నాడన్నారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అధ్యాపకులు షాలిని, జోష్ణ, ఆనంద రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

బాపులపాడు మండలంలోని పెరికీడు గ్రామంలో నాలుగు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిఇఒ

రోడ్ల కూడలిలోని జయదేవ్ హిందూ ఎయిడెడ్ స్కూల్‌ను కరస్పాండెంట్ పుట్టి రాంబాబు ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. గుడివాడ ఆర్‌డిఒ పద్మావతి, డిఇఒ తాహేరా సుల్తానా, ఎంఇఒ సక్సేనా రాజు స్కూలుకు వచ్చి రికార్డులు తనిఖీ చేశారు. ఆస్తుల గురించి ఆరా తీశారు. సర్పంచ్ పల్లపోతు జాన్ ప్రకాష్ స్వాగతం పలికారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెడ్ మాస్టర్ వలివేటి జ్యోతి, ఉపాధ్యాయుడు రాజు, నందూరి శర్మ, నక్కా బాబు, తవ్వా మూర్తి, మెరుగుమాల వేణు, మజ్జి దీవేన కుమార్, లోయ వెంకటేశ్వరరావు, వెలగఫల్లి రాజేష్, విఆర్ఒ కృపాపాల్ పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-గన్నవరం

సమాజంలో పలు సామాజిక సమస్యల పట్ల ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో మహిళా విభాగమైన కళ్యాణమయి బాధ్యతాయుతంగా స్పందిస్తుందని గన్నవరం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కళ్యాణమయి బ్రాంచ్ అధ్యక్షురాలు మల్ల కంటి మాధవి లత అన్నారు. గురువారం కళ్యాణమయి బ్రాంచ్ సభ్యులు దాదాపు 20 మంది సొంతంగా నిధులు సేకరించి బుద్ధవరంలోని కేర్ అండ్ షేర్ అనాధాశ్రమానికి రూ.25 వేలు విలువచేసే నిత్యావసర సరుకులను, ఇతర దుస్తులను ఉచితంగా అందజేశారు. అనంతరం మాధవీలత మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 1987 నుంచి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చిన్నారులు, మహిళలు, యువతకు అవసరమైన విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వీటితోపాటు విమానాశ్రయంలో పనిచేసే మహిళ, పురుష ఉద్యోగుల నుంచి సొంతంగా నిధులు సమీకరించి వివిధ సేవా స్వచ్ఛంద సంస్థలకు తరచుగా అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో విజయవాడ కళ్యాణమయి బ్రాంచ్ ద్వారా మరిన్ని విభాగాల్లో సేవా కార్యక్రమాలు ప్రణాళిక బద్ధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణమయి బ్రాంచ్ సభ్యులు, విమానాశ్రయ సిబ్బంది పాల్గొన్నారు.



నిత్యావసరాలను అందజేస్తున్న ప్రతినిధులు

టిడిపి ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-నాగాయలంక


రాష్ట్రానికి ఇదేమి ఖర్మ కార్యక్రమంలో భాగంగా నాగాయలంక మండలంలోని గుల్లలమోద గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా), ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు (చంటి), మాజీ ఎంపీపీ సజ్జా గోపాలకృష్ణ, పెద్దపాలెం సర్పంచ్ దున్న రాజేష్,భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయ్ భాస్కర్, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, ఉప్పాల ప్రసాద్, మేడ భుజాలు,కుబేర వర్మ, వల్లభం రామ్మోహనరావు,విశ్వనాథపల్లి వెంకటస్వామి, కొక్కిలిగడ్డ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టిడిపి నాయకులు

రైతులను ఆదుకోవాలని వినతి

నాగాయలంక : నాగాయలంక మండలంలో మాండూస్ తుఫాన్ కారణంగా భారీ వర్షాలుకు వరికోసిన పనలు, పడిపోయిన పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలనకు పౌరసరఫరాలశాఖ అధికారి బి.పార్వతి వచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు ఆమెను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ముంపునకు డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందనీ, డ్రెయినేజీ అధికారులు పర్యవేక్షణ సరిగా లేకపోవడం, డ్రైనేజీ తవ్వకాల్లో నాణ్యత లేకపోవడం,భావదేవరపల్లి మెయిన్ డ్రైన్ తవ్వకపోవటం, భారీ



డిఎస్‌ఒకు వినతిపత్రాన్ని అందజేస్తున్న టిడిపి నాయకులు

వర్షాలు కురిసి వారం రోజులైనా అధికారులు పర్యవేక్షణ చేయకుండా కాలయాపన చేయడం ద్వారా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. అపరాల విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలనీ, ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయ్ భాస్కర్, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, తలసిల స్వర్ణలత. తిరుమలశెట్టి మస్తానరావు, ఉప్పాల ప్రసాద్‌లు వినతిపత్రాన్ని అందజేశారు.

గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం

ప్రజాశక్తి-నాగాయలంక

నాగాయలంక మండల వ్యాప్తంగా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. మద్యం దుకాణానికి అనుబంధంగా బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కొందరు అధికారులు మామూళ్ల మత్తులో మునిగి వీరికి సహకరిస్తున్నట్లుగా విమర్శలు వస్తున్నాయి. బెల్ట్ షాపు నిర్వాహకులకు ఒక ప్రత్యేక వాహనంలో మద్యం సరఫరా జరుగుతున్నట్లుగా సమాచారం. రాత్రి ఏడు గంటల సమయం దాటిందంటే మండల కేంద్రమైన నాగాయలంకలోని మూడు ప్రభుత్వ ప్రధాన మద్యం అమ్మకాలు చేపట్టే షాపుల్లో ఒక ప్రైవేటు వాహనాన్ని ఏర్పాటు చేసుకొని సుమారు 30 నుంచి 35 కేసులతో లోడు చేసుకుంటూ, రాత్రి సమయంలో గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లుగా పలువురు విమర్శిస్తున్నారు. నిర్వాహకులకు ఒక్కొక్క సీసాకు రూ.30 నుంచి రూ.40 అదనంగా తీసుకుని సరఫరా చేస్తున్నట్లు సమాచారం. బెల్టు షాపు నిర్వాహకులకు 'మీ వద్దకు ఏ అధికారి రారు..ఎలాంటి భయాందోళనలు చెందకుండా బహిరంగంగానే మద్యం అమ్ముకోవచ్చు' అంటూ నిర్వాహకులు హామీలు ఇస్తున్నట్లుగా తెలుస్తోంది. దీంతో బెల్టుషాపుల నిర్వాహకులు మరింతగా రెచ్చిపోతున్నట్లుగా పలువురు పేర్కొంటున్నారు. ఎవరైనా మద్యం దుకాణాల విషయమై అధికారులకు సమాచారం ఇస్తుంటే వారు వెంటనే నిర్వాహకులకు సమాచారం ఇస్తున్నట్లుగా తెలుస్తోంది. వెంటనే వారు జాగ్రత్త పడుతున్నట్లుగా పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాల చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుని నియంత్రించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

మోపిదేవి : మండల పరిధిలోని పెదప్రోలు శివారు ప్రశాంతినగర్‌కు చెందిన గుమ్మడి ఏసమ్మ (47) అనారోగ్యంతో మరణించారు. గురువారం ఉదయం ఆమె కుమారుడు గుమ్మడి నవీన్‌కు రూ.10వేలు వైఎస్సార్ భీమా నగదును తక్షణసాయంగా మట్టి ఖర్చుల నిమిత్తం గ్రామ సర్పంచ్ పోలిట్ల ఏసుబాబు, ఎంపీటీసీ సభ్యులు మద్దాల శ్రావణి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పేర్ని మాదవేంద్రరావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, గ్రామస్తులు భోజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న అధికారులు

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

ఎపి ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పేదలకు మేలు చేస్తున్నాయని ఎపి ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. ఎపి ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని లీలా గ్రాండ్ హోటల్‌లో 'ఆంధ్రాలో అభివృద్ధి- సంక్షేమం - వాస్తవాలు - వక్రీకరణ' అన్న అంశంపై గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొమ్మినేని మాట్లాడుతూ 11.43 శాతం ఆర్థికాభివృద్ధితో ఎపి దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా మొదటిసారిగా సంక్షేమ ఫలాలు నేరుగా నిరుపేదలకు అందుతున్నాయన్నారు. అయితే కొన్ని ప్రతిపక్షాలు, పత్రికలు దురుద్దేశంతో ఆంధ్రా ప్రగతిపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి సంతృప్తికరంగా ఉందన్నారు. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్. కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బిజెపి నాయకుడు చందు సాంబశివరావు, జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణకిషోర్, బెటర్ ఆంధ్రప్రదేశ్ కో-కన్వీనర్ లఖంరాజు సునీత, వైసిపి అధికార ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, బెజవాడ మీడియా సెంటర్ అధ్యక్షుడు చందన మధు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి మేళం భాగ్యారావు, సీనియర్ పాత్రికేయుడు బ్రహ్మయ్య తదితరులు ప్రసంగించారు.



ఎంఎల్ఎ సారథి వాస్తవాలు చెప్పాలి : టిడిపి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : యనమలకుదురు వంతెన కాంట్రాక్టర్, తాను పార్టనర్లుగా ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్లో ఎంఎల్ఎ కొలుసు పార్థసారథికి గుర్తులేదా అని మాజీ ఎంఎల్ఎ, టిడిపి పెనమలూరు నియోజకవర్గ ఇన్చార్జి, పార్టీ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి బోడే ప్రసాద్ ప్రశ్నించారు. వంతెన నిర్మించడం చేతగాక టిడిపిపై నిందలు మోపుతున్నారని విమర్శించారు. ఎంఎల్ఎ నిర్లక్ష్యమే ప్రజలకు శాపంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు ఆయన ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. విజయవాడ ఆటోనగర్లోని టిడిపి కార్యాలయంలో బోడే ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ 2014-2019 వరకు ఇన్‌లాండ్ వాటర్ స్కీంలో బందరు కెనాల్‌ను చేర్చడం వలన 2014, 2016, 2017 వరకు గతంలో ఉన్న యనమలకుదురు బ్రిడ్జి నిర్మాణం ఆగిపోయిందని, తిరిగి ఇన్‌లాండ్ వాటర్ స్కీం రద్దయిన తర్వాత కాంట్రాక్టర్‌తో మాట్లాడి నష్టమొస్తే తాము భరిస్తామని చెప్పామన్నారు. 90 శాతం వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత ఎన్నికలు రావడం, కాంట్రాక్టర్ పనులు ఆపేయడం జరిగాయన్నారు. వంతెన నిర్మాణానికి కిరణ్‌కుమార్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు నిధులు మంజూరయ్యాయని, కానీ బోడే ప్రసాద్ దానిని పూర్తి చేయలేకపోయారని, కాంట్రాక్టర్ టిడిపికి చెందిన వ్యక్తి అయినందున సరిగా పనిచేయడంలేదని మీడియా సాక్షిగా ఎంఎల్ఎ సారథి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అయితే తన ఎన్నికల అఫిడవిట్లో నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్‌లో తనకు షేరు ఉన్నట్లు ఎంఎల్ఎ సారథి పేర్కొన్నారని వెల్లడించారు.

మొదటి పేజీ తరువాయి

'నవయుగ'కు చుక్కెదురు

నిర్ణయించనున్నారు. బందరు పోర్టు నిర్మాణానికి అవసరమయ్యే మెటీరియల్‌ను భారీ వాహనాలపై తరలించాల్సి ఉంటుంది. ఈ వాహనాల రవాణాకు అనుగుణంగా పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సమీపంలోని జాతీయ రహదారులకు, రైలు ట్రాక్‌లకు అనుసంధానం నిమిత్తం రోడ్డు, రైల్వే ట్రాక్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణకు కసరత్తు జరుగుతోంది. 146 ఎకరాలకు ప్రయివేటు భూమి సేకరణకు ప్రభుత్వం త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వనుంది.

మైటాస్ నుండి మెగా వరకు...

తొలుత ఉమ్మడి రాష్ట్రంలో 2008లో బందరు పోర్టు నిర్మాణ బాధ్యతలను మైటాస్ సంస్థతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. కేటాయించిన భూముల ద్వారా బ్యాంకుల నుంచి వంద కోట్లకుపైగా రుణాలు తీసుకున్న మైటాస్ కంపెనీ...పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించింది. మైటాస్ దివాళా తీయడంతో ఆ తర్వాత నవయుగ సంస్థతో ప్రభుత్వం భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. 2019 ఫిబ్రవరిలో ఎన్నికలకు ముందు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పోర్టు పనులు ప్రారంభించారు. ఆ తర్వాత వైసిపి అధికారంలోకి వచ్చింది. పోర్టు నిర్మాణ పనులు జాప్యం చేస్తోందనే కారణంతో నవయుగ సంస్థతో వైసిపి ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. దీనిపై నవయుగ సంస్థ హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రయివేటు భాగస్వామ్య పద్ధతిలో పోర్టు నిర్మాణానికి గత కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాలు పూనుకోగా, తాజాగా ఇపిసి పద్ధతిలో పోర్టును తామే నిర్మిస్తామని వైసిపి ప్రభుత్వం ప్రకటించింది. ఎపి మారిటైం బోర్డు టెండర్లు హ్వానించింది. ఈ టెండర్లను మెగా ఇంజినీరింగ్ సంస్థ దక్కించుకుంది. తాజాగా నవయుగ పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడంతో పోర్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది.

భవానీ దీక్షల విరమణ ప్రారంభం

కంటే ఈ ఏడాది భవానీలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, గిరి ప్రదక్షిణ, హోమ గుండం ఏర్పాట్లు, ఇరుముళ్ల విరమరణ, దుర్గమ్మ దర్శనం, ప్రసాదం సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్యూలైన్ల ద్వారా త్వరగా దుర్గమ్మ దర్శనం చేసుకునేలా చూడాలని, ప్రసాదాలకు లోటు లేకుండా సిద్ధం చేసుకోవాలని అన్నారు. భవానీ దీక్షలదారుల నుండి ఎటువంటి ఫిర్యాధులు రానీయకుండా కార్యక్రమ నిర్వహణపై అధికారులు అప్రతమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇవో దర్భముళ్ల భ్రమరాంభ, ఇఇలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ గురై యువకుడు మృతి

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : నున్నలోగల 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లో గురువారం ప్రమాదవశత్తుగా యువకుడు మతి చెందాడు. నున్న - భీమడోలు విద్యుత్ లైన్ మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో స్తంభంపై ఉన్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన అజ్జావుల్ హుక్ (20)కు విద్యుత్ షాకు తగిలింది. తీవ్రంగా గాయపడిన అతడిని సమీపంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మతి చెందాడు. నున్న రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తడి పొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ : క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ (క్లాప్), స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యాక్రమాలు, చెత్త విభజన, స్వచ్ఛనగరం వంటి పలు అంశాలపై గురువారం నగరంలో అవగాహన కల్పించారు. వన్‌టౌన్ సర్కిల్-1 పరిధిలోని 51వ డివిజల్లో గల శ్రీ ప్రోలు రాజా హైస్కూలు ప్రాంగణంలో గురువారం డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించినారు.

CHANGE OF NAME

I, ABDUL KAREEM MOHAMMAD JABEER (Old Name), R/o. D.No.S-9, Ram VSR Apartments, Opp. Siddhardha Public School, Mogalrajpuram, Vijayawada - 520 010, NTR District, A.P. I have changed my name to ABDUL KAREEM. Here after my name is known as ABDUL KAREEM.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT:AVANIGADDA
O.S.No.19/2021

Between:
1.Talasila RamKumar,
S/o Late T.Siva Rama Krishna,
D.No.1-105/13, Gannavaram Mandal,
East Godavari Dt-533285
2.Talasila Padma, W/o
Late T.Lakshman Kumar, D.No.12-404,
Yanamalakuduru, Lambadipeta,
Penamaluru Mandal, Krishna Dt-520007.
...Petitioners/Plaintiff
And
1.Talasila Suvarna Lakshmi
W/o Late T.Siva Rama Krishna
2.Talasila Naveen Kumar
S/o Late T.Siva Rama Krishna, Resident of 1st Ward, Nagayalanka Village or Post, Nagayalanka Mandal, Krishna Dt-521120.
(పై ఇద్దరు ప్రతివాదులు పై అడ్రస్‌లో నివాసం ఉంటారు.)

పై నెంబరు దావాలో 1, 2 ప్రతివాదులు అయిన తలశిల సువర్ణ లక్ష్మి, తలశిల నవీన్ కుమార్ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.20-12-2022 వ తేదిన వాయిదా వేసియున్నారు. సదరు 1, 2 ప్రతివాదులు ది.20-12-2022 ఉదయం గం.10-30ని॥లకు శ్రీకోర్టు వారి ముందు ప్రత్యక్షంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియపరచడమైనది.
(By Order Of The Hon□ble Court)
వాయిదా:20-12-2022

Y.KOTESWARA RAO, Com,LLB
ADVOCATE, #32-26-68,
Near S.R.R. College, Sunkara Venkateswara Rao Street,
Machavaram, Vijayawada-520004,
Cell:9866832029.

మహారాజశ్రీ మచిలీపట్నం 3 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్ట్ సమఖమునకు
O.S.No.152 of 2020

బిట్వీన్:
గోపు మురళి మోహన్ ...వాది.
మరియు
జొన్నాల ఏసుబాబు ...ప్రతివాది
జొన్నాల ఏసుబాబు
తండ్రి: లేటు ప్రకాశ రావు, వన్నూరు, కానూరు పోస్ట్, మచిలీపట్నం మండలం, కృష్ణాజిల్లా.

పై నెంబర్ దావాలో పలుమార్లు సమన్లు పంపినప్పటికిన్ని మీరు పై కోర్టు వారి ఎదుట హాజరు కానందున మీరు ది.19-12-2022 వ తేదీన ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టువారి ఎదుట హాజరు కావలెను లేని యెడల మీ పరోక్షములో తగిన యుత్తర్వులు జారీ చేయుదురని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.
మచిలీపట్నం
Date: 15-12-2022

జి.వి.ఎల్. నరసింహారావు,
పులి పవన్ కుమార్,
వాది తరపు న్యాయవాదులు.

మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో భీమవరం
E.A.No.61/2022 in E.P.No.2/2017 in O.S.No.142/2013

Between
శ్రీమతి ఉద్ధరాజు ఉష పిటీషనరు / 3rd Party Purchaser
మరియు
1. నడకుడిటి కనకదేశమ్మ - DHR cum Action Purchases
2. నాగిడి గోపాలరావు - JDR
To
1. నడకుడిటి కనక దేశమ్మ, W/o.: లేటు నర్సింహమూర్తి, హిందూ, వయస్సు : 65 సం., ఆడ, Properties, చిన్న గొల్లపాలెం, కృత్తివెన్ను మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్
2. నాగిడి గోపాల రావు, S/o. : పరశురామయ్య, హిందూ, వయస్సు 57 సం., మగ, వ్యాపారం, జ్యోతి హాస్టల్ మిషన్ హైస్కూల్ ఎదురుగా, నర్సాపురం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

పై నెంబరు Claim petition E.A.No.61/2022 in E.P. No.2/2017 in O.S.142/2013 లో మీకు సమన్లు పంపించినప్పటికి అందుకొనక కాలయాపన చేయుచున్నందున యీ ప్రకటన పూర్వకంగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తెలియజేయునది ఏమనగా ది.20-01-2023 సం. తేదీన ఉదయం గం.10.30 ని.లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు స్వయంగా గాని, మీ న్యాయవాది ద్వారా గాని తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున మిమ్ములను తీర్మానించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ మొగళ్ల వెంకట రమణారావు, B.Com., B.L.
తేది : 9-12-2022 **అడ్వకేటు, భీమవరం**
భీమవరం **Mobile No.: 98491 33488**

కోర్టు ప్రకటన

IN THE COURT OF THE Ist JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S No: 969/2020

Between :-
UNION BANK OF INDIA, E- ANDHRA BANK (RECENTLY THE ANDHRA BANK MERGED WITH UNION BANK OF INDIA) VIJAYAWADA MAIN BRANCH, Rep by its ASST. GENRAL MANGER..........Plaintiff
AND
M\s D.S.L ENGINEERS,Proprietor of PATIBANDLA HAMANTH KUMAR ....Defendant
To,
M/S D.S.L Engineers, Proprietor of Patibandla Hamanth Kumar D.No: 15/A1, 3rd Road, Industrial Estate, Vijayawada, Krishna District - 520010...................Defendant

పై నెంబరు దావాలో వాది తనకు రావాలసిన బాకీ మొత్తంను రాబట్టు కొనుటకు ప్రతివాది అయిన మీ పై దావా దాఖలా చేసియున్నారు. సదరు ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు వారు నోటీసులు పంపిన తీసుకొనకుండా త్రిప్పిపంపిన కారణంగా మీ హజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.03-01-2023న వాయిదా వేసినారు. సదరు తేదిన ఉదయం గం॥ 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను.లేనియెడల మీ పరోక్షంగా తీర్మానం చేయగలరని తెలియజేయడమైనది.
(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 03-01-2023
ఇట్లు:- హూరున్నాసా బేగం
వాది తరపు న్యాయవాది
విజయవాడ-1. ఫోన్ :9848471048

In The Court Of The Hon□ble III Addl. Junior Civil Judge At Vijayawada
I.A.No.133/2018 in O.S.No.377/2016

Between
Avuthu Lakshma Reddy
...Petitioner/Plaintiff
AND
1.Kolli Radha Krishna Reddy (Died)
2.Donthireddy Venkata Reddy and 4 Others
...Prospposed Respondents/Defendents
Prosposed Respondent No.6/Defendent No.6: Bommareddy Jayalakshmi, W/o Rajasekhar Reddy, Kundavari Kandrika Village, Pathapadu Post, Vijayawada Rural Mandal, Krishna District.

పై నెంబరు దావా, I.A.No.133/18 లీగల్ రిప్రజెంటేటివ్ పిటీషన్‌లో శ్రీ కోర్టువారు ఉత్తర్వుల ప్రకారము Prosposed Respondent No.6 /Defendent No.6 కు I.A నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా జారిచేయు నిమిత్తము పై సూచించిన కోర్టువారు ది.20-12-2022నకు వాయిదా వేసియున్నారు. కావున సదరు Prosposed Respondent No.6 /Defendent No.6 ది.20-12-2022న పై సూచించిన కోర్టువారి ఎదుట ఉదయం 10-30 లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా హాజరై తమకు గల ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించెదరని యిందు మూలంగా తెలియచేయ డమైనది.
(శ్రీ కోర్టువారు ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా ది.20-12-2022

ఎ.శ్యామ్ సుందర్ రెడ్డి,
పిటీషనర్/వాది తరుపు న్యాయవాది,
విజయవాడ-520003.

AUCTION NOTICE
IN THE HONOURABLE COURT OF THE XVI ADDITIONAL DISTRICT JUDGE AT NANDIGAMA, KRISHNA (NTR)DISTRICT,
E.P.509/2019 IN A.A.820/2012

Between:
M/s. SHRIRAM TRANSPORT FINANCE COMPANY LIMITED
... DHr
And:
Sri. Venkateswara Transport Corporation and another
... JDr's

SALE OF IMMOVABLE PROPERTY

The General Public / Interested bidders are hereby informed that in the above E.P. the below mentioned immovable properties belonging to Judgment Debtor herein are ordered for Sale in an open court auction, the said auction is to be held on **02-01-2023** in the premises of XVI Additional District Judge at Nandigama, Krishna (NTR) District at **10:30 Am.**

SCHEDULE OF THE PROPERTY

Schedules of Immovable Property belongs to 1 nd JDR Mr. Thotakura Kiran Kumar acquired under sale deed dated **17-12-2003** executed by Mr. Yerramreddy Venkateswara Rao under registered sale Deed No. 2197/2003 SRO kanchikacherla, Krishna (NTR) District.

ITEM NO – 1:
Krishna (now NTR) District, kanchikacherla S.R.O, paritala Gram Panchyat, Paritala Village in Survey No.427/1, total extent of Ac 1.00 cents out of executant's land of Ac. 2.00 Cents out of Ac. 8.30 cents, being bounded by
East **Land** of Chagantipati Venkata Narayana
South **Land** of Seelam Veraraghuvulu
West **Land** of Uppaluri Koteswara Rao and others
North **Land** of Cherukuri Murali Mohan

ITEM NO – 2:
Krishna (NTR) District, kanchikacherla S.R.O, Paritala Gram Panchyat, Paritala Village in Survey No.429/1, total extent of Ac 2.75 cents out of executant's land of Ac. 11.35 Cents being bounded by
East **Land** of Koganti Koteswara Rao
South **Land** of Chagantipati venkata narayana
West Pantakaluva
North Pantakaluva

DHR'S VALUE Rs.65,00,000/-
// BY ORDER OF THE COURT//
T.V.V.S.SARMA, ADVOCATES.,
Nandigama, Krishna District

ప్రకటన

గ్రామ పంచాయతీ కార్యాలయము, మద్దూరు,

తేది:14-12-2022

కృష్ణా జిల్లా, కంకిపాడు మండలం, మద్దూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆర్.ఎస్. నెం.106/3,4,5,6,7,8,9,10,11,12, 109/2,3 110/1,2,54/1ఎ,1బి,2 ర్లు దాఖలా య.11.21సెంట్లు భూమిలో వేయబడిన ఇన్ ప్రిన్సిపల్ లే అవుట్ ను ప్రభుత్వ జి.ఓ యమ్.ఎస్.నెం.10MA&UD, డిపార్టమెంట్, తేది 10-1-2020 ఉత్తర్వులలో రూల్ నెం.8 అనుసరించి IPLP నెం. IPLP2020/AMRDA/MADD/0000101 మరియు శ్రీయుత మెట్రోపాలిటన్ కమీషనరు AMRDA, విజయవాడ వారి ఫైల్ నెం. తేది 28-10-2021 ప్రకారము అనుమతి ఉత్తర్వులు అనుసరించి యీ దిగువ తెలిపిన షెడ్యూలు ప్రకారము మద్దూరు గ్రామ పంచాయతీకి ఎటువంటి ప్రతి ఫలము ఆశించకుండా ప్రతి ఫల రహితముగా సకల ప్రజోపయోగ నిమిత్తం గ్రామ పంచాయతీ షరుతలకు లోబడి దానము చేయుటకు కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, యనమలకుదురు గ్రామ వాస్తవ్యులు పడవల వెంకట రమణ, పడవల కరుణాకర్, పెదపులిపాక గ్రామ వాస్తవ్యులు అట్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, కోడూరు మండలము కోడూరు గ్రామ వాస్తవ్యులు చాపరాల అనిల్ కుమార్ వారు గ్రామ పంచాయతీకి ది.05-10-2022న అర్జీ దాఖలు చేసియున్నందున యిందు ఆస్థిపై ఎవరికి అయినను అభ్యంతరములు ఉన్న యెడల పూర్తి వివరాలతో యీ ప్రకటన వెలువడిన 7 రోజులు లోపుగా గ్రామ పంచాయతీకి లిఖిత పూర్వకముగా తెలియజేయగలరు. లేనిచో తదుపరి చర్యలు తీసుకొనబడునని యిందుమూలముగా తెలియపరచడమైనది. రోడ్డు యొక్క హద్దులు మరియు మరిన్ని వివరాలకు గ్రామ పంచాయతీ పని వేళలయందు అడిగి తెలుసుకొనవలయును.

ఇన్ ప్రిన్సిపల్ లే అవుట్ నందు వేయబడిన రోడ్లు తాలూక దానము చేయు స్థలము యొక్క షెడ్యూలు
1.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.443.66లు, 2.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.2046లు
3.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.1681.16లు, 4.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.2572.16లు,
5.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.781లు, 6.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.1232లు,
7.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.2635.5లు, 8.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.436.33లు,
9.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.425.33లు, 10.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.742.5లు,
11.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.770లు, 12.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.625.69లు,
13.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.649లు, 14.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.165లు,
15.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.1576.66లు, 16.వ ప్రతి రోడ్డు యొక్క స్థలము చ.గ.1238.16లు,
వెరశి 1వ ప్రతి నుండి 16వ ప్రతి వరకు దానము చేయు రోడ్ల యొక్క స్థలము చ.గ.18,020.15లు

గమనిక:
ప్రకటన రద్దు పరుచుటకు లేదా మార్పులు, చేర్పులు చేయుటకు గ్రామ పంచాయతీకి అధికారము కలదు.

సం.చింతా కిరణ్ కుమార్,MBA
పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ I(ఈ.ఓ గ్రేడ్ II)
గ్రామ పంచాయతీ,మద్దూరు.

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్

దేశ అధికార భాష హిందీని 'కమ్ జోర్ హిందీగా' సంబోధించిన కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మల సీతారామన్ దేశ ప్రజలకు పార్లమెంటు వేదికగా క్షమాపణ చెప్పాలని హిందీ సేవాసదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి షేక్ గైబువల్లి డిమాండ్‌చేశారు. రెండు రోజుల క్రితం పార్లమెంటులో హిందీ భాషేతర ప్రాంతమైన తెలంగాణ రాష్ట్రం నుండి ఎన్నికైన పార్లమెంటు సభ్యుడు రేవంత్ రెడ్డి రూపాయి విలువ పతనం కావడాన్ని లోక్ సభలో హిందీలో కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మల సీతారామన్‌ని ప్రశ్నించారని పేర్కొన్నారు. అడిగిన ప్రశ్నకు మంత్రి నిర్మలా సీతారామన్ నేరుగా సమాధానం చెప్పకుండా తెలంగాణ నుంచి వస్తారు "ఉన్ కీ కమ్ జోర్ హిందీ కో కమ్ జోర్ హిందీ .. మే జవాబ్ దే రహీహుం" అని పార్లమెంటు సాక్షిగా భారత ప్రభుత్వ అత్యున్నత పదవి కేంద్ర ఆర్థిక శాఖామంత్రిగా వుండి పదేపదే దేశ అధికార భాష హిందీని "కమ్ జోర్ హిందీ - కమ్ జోర్ హిందీ" అని వ్యాఖ్యానించడం సరికాదని పేర్కొన్నారు. దేశ అధికార భాష హిందీకి జరిగిన అవమానంగా హిందీ భాషేతర రాష్ట్రాలకు జరిగిన అవమానంగా భావించాలని కోరారు. హిందీ భాషకు అవమానం అంటే దేశ ప్రజలకు అవమానం జరిగినట్లేనని పేర్కొన్నారు. ఈ విషయమై దేశ ప్రజలకు పార్లమెంటు సాక్షిగా కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మల సీతారామన్ "కమ్ జోర్ హిందీ" అనే వ్యాఖ్యలను వెనుక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె క్షమాపణ చెప్పకుంటే దేశ అధికార భాష హిందీ పైన, భారతదేశ రాజ్యాంగం, భారతదేశం ప్రజలపైన గౌరవం లేదని భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు.



నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

నాగాయలంక మండల పరిషత్ సమావేశంలో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-నాగాయలంక

మాండూస్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని పలువురు ప్రజాప్రతినిధులు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీపీ భోగాది రాఘవరాణి అధ్యక్షతన నాగాయలంక మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ తుపానుతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు చొప్పున నష్టపరిహారాన్ని అందించడంతోపాటు వారికి కావలసిన అపరా విత్తనాలను కూడా ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. ఈ మేరకు భావదేవరపల్లి, పెదపాలెం గ్రామ పంచాయతీ సర్పంచులు మండలి ఉదయభాస్కర్, దున్న రాజేష్ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

జాతీయ ఖో ఖో పోటీలకు ఎస్‌పిఎస్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-గుడివాడ

ఈ నెల 26 నుండి 30వ తేదీ వరకు కోల్‌కొతాలో జరిగే 41వ జాతీయ జూనియర్ ఖో-ఖో పోటీలకు ఎపి జట్టులో ఎస్‌పిఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ కార్యదర్శి మడకా ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక ఎస్‌పిఎస్ పాఠశాలలో జాతీయ క్రీడలకు ఎంపికైన టి.తిమెతి, బి.నాగసుశీలను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 9 నుండి 11 వరకు కర్నూలు జిల్లా ఆత్మకూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.రాణి, ఖో-ఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శులు టిఎస్‌ఆర్‌కె ప్రసాద్, ఎం.సీతారామిరెడ్డి, డివైఇఓ పి.వినయకుమార్, సంఘ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, చీఫ్ పాట్రన్ కె.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను దోపిడీ చేస్తున్న మిల్లర్లు : సిపిఎం

గన్నవరం : తేమశాతం పేరుతో రైతులను దోపిడీ చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గన్నవరం మండలంలో తుఫాను ప్రభావంతో కొన్ని గ్రామాల్లో వరి ధాన్యం తడిసిందన్నారు. వీరపనేనిగూడెం, చిక్కవరం, కొత్తగూడెం, తెంపల్లి, కేసరపల్లి సావరగూడెం ఏరియాలో ఈ పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో నిర్ణయించిన ధర్మ శాతాన్ని పెరగడంలో తీసుకుని ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. మిల్లర్ల వద్దకు ధాన్యం మిగిలిన తర్వాత తేమశాతం ఎక్కువగా చూపించి బస్తాకు రూ.20 నుంచి రూ.50 వరకు తగ్గించి ఇస్తామని చెబుతున్నారని తెలిపారు. ఈ విధంగా రైతులను మిల్లర్లు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. తుఫాను ప్రభావంతో రైతులు కొంతవరకు నష్టపోయారన్నారు. పంట కొనుగోలులో మిల్లర్ల దోపిడీ వల్ల మరింత నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన రైతు గాంధీ రైతు రైతు భరోసా కేంద్రంలో 16 శాతం తేమ ఉందని తేల్చి ధాన్యం కొనుగోలు చేయటం లేదన్నారు. ఆ ధాన్యం మిల్లర్లకు వెళ్లేసరికి 20 శాతం తేమ శాతం ఉందని చెబుతూ కట్టకు రూ.40 తగ్గించి ఇస్తామని చెప్పడంతో ఆ రైతు అయోమయానికి గురికావాల్సి వచ్చిందన్నారు. ఈ విధమైన పరిస్థితి అన్ని గ్రామాల్లో ఉందన్నారు. కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. అధికారులు తక్షణమే రంగంలోకి దిగి తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని, మిల్లర్ల దోపిడీపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కానీ అధికారులు కానీ చర్యలు తీసుకోకుంటే రైతులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వినతి

రాష్ట్ర ప్రభుత్వం రైతు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని ప్రకటించిందనీ, ఆచరణలో క్షేత్రస్థాయిలో దానికి పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోందని సిపిఎం ఉంగుటూరు మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు విమర్శించారు. తేమశాతం రైతు భరోసా కేంద్రాల ద్వారా నిర్ధారిస్తే ఇంకా ఎవ్వరూ చేయాల్సిన పనిలేదని చెప్పారని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఆర్బికెలో చూపించి ఆ ధాన్యాన్ని మిల్లర్ల దగ్గర తీసుకెళ్తే అక్కడ తేమశాతం చూసి పాయింట్లు రూ.20 చొప్పున కట్ చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పులి శ్రీనివాసరావు, ఎం.సంతోష్ కుమార్, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు

క్రాప్ హాలిడేపై త్వరలో నిర్ణయం : జెసి



మొలకలు వచ్చిన వరి పనలను పరిశీలిస్తున్న జెసి, ఎమ్మెల్యే తదితరులు

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండలంలో రైతులు స్వచ్ఛంధంగా కొన్ని ప్రాంతాల్లో క్రాప్ హాలిడే ప్రకటించినట్లుగా తన దృష్టికి వచ్చిందనీ, త్వరలో ఈ విషయమై పర్యటించి నిర్ణయం తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ సిన్సిన్వార్ వెల్లడించారు. కోడూరు మండలం పరిధిలోని మాచవరం, హంసలదీవి, పాలకాయతిప్ప, దింటిమెరక గ్రామాల సమీపంలో నాట్లు వేసి నీట మునిగిన పంట పొలాలను, ఉప్పు నీటి వల్ల బీడు మారిన సాగు భూములను జాయింట్ కలెక్టర్ గురువారం పరిశీలించారు. వర్షం కారణంగా తడిచిన వరి పనలను దిగువ ప్రాంత భూములను ఆమె పరిశీలించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు వివరాలను జెసికి వివరించారు. వర్షాలు కారణంగా దెబ్బతిన్న పొలాల గురించి దానివల్ల రైతుకు జరిగే నష్టం గురించి కోడూరు దిగు ప్రాంతంలో మూడు సంవత్సరాలుగా రైతులు పడుతున్న ఇబ్బందులు గురించి, సాగుభూమి బీడు భూముగా మారటానికి కారణమైన ఔట్ పాల్స్ స్లూయిస్ గురించి జాయింట్ కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా అపరంజిత సింగ్ సిన్సిన్వార్ మాట్లాడుతూ కోడూరు మండలంలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను దీర్ఘకాలికంగా రైతుల సమస్యలను పరిశీలించి ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఉప్పునీటి కారణంగా నాట్లు వేయలేక స్వచ్ఛందంగా 17వ నెంబర్ కాల్వ క్రింద క్రాప్ హాలిడే ప్రకటించామని వివరించారు. తమకు ప్రభుత్వం నుంచి తగిన నష్టపరిహారం అందించాల్సిందిగా కోరారు. మరి కొద్ది రోజుల్లో కోడూరు మండల ప్రాంతంలో మరలా పర్యటించి రైతుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక ప్రభుత్వానికి అందించనున్నట్లు ఆమె తెలిపారు. వీరి వెంట కోడూరు మండల తాసిల్దార్ ఎస్ కె లతీఫ్ పాషా, జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, జిల్లా రైతు విధాత కార్యదర్శి కొండవీటి వెంకట నారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు పరిశే మాధవరావు, వ్యవసాయ శాఖ అధికారి భాను ప్రకాష్, సురేష్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు ముద్దినేని చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

26నాటికి ఓటర్ల సవరణ జాబితా సిద్ధం : కలెక్టర్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

ఈ నెల 26కు ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2023ను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎన్నికల నమోదు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌భాష

వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బంగ్లా నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై జిల్లాల వారీగా ఆయన సమీక్షించారు. నవంబర్ 9 నుంచి డిసెంబర్ 8 వరకు జిల్లాలో సాధించిన ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిని రాష్ట్ర సీఈఓకు వివరించారు. ఏపీ సీఈఓ సూచనల మేరకు కలెక్టర్ జిల్లాలోని 7 నియోజకవర్గాల ఇఆర్‌ఒలు, ఎఇ ఆర్‌ఒలకు దిశానిర్దేశం చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జనవరి 5న తుది ఎన్నికల జాబితా ప్రచురణ నేపథ్యంలో ఈ నెల 25 కల్లా జిల్లా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, బందరు, ఉయ్యూరు డివిజన్ల ఆర్డీఓలు ఐ. కిషోర్, విజయ్ కుమార్ , ముడా వీసీ బి.శివనారాయణరెడ్డి, బీసీ వెల్ఫేర్ ఉప సంచాలకులు సిహెచ్. లక్ష్మీ దుర్గా, డిఎస్ఓ వి.పార్వతి, కలెక్టరేట్ తహసీల్దార్ హరనాద్, ఎన్నికల విభాగం అధికారి శ్యామ్నాద్ తదితరులు కలెక్టర్ తో పాటు ఉన్నారు.

ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలి

ప్రజాశక్తి-మొవ్వ

మాండూస్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని ఎపి కౌలు రైతుసంఘం కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని చిన ముత్తేవి, అవిరిపూడిలోని రైతు భరోసా కేంద్రాల్లోని అధికారులను గురువారం కలిసి ఈ మేరకు వినతిపత్రాలను



ఆర్‌బికె ధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

అందజేశారు. ఈ సందర్భంగా శీలం నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపడ్డారని. ఆరుగాలం పండించిన పంట చేతికివచ్చే తరుణంలో వర్షాలు కురవడంతో పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. కోతలు కోసి పైరు పనుల మీద ఉన్న నేపథ్యంలో రైతుకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. రెండో పైరు మినుము, పెసలు విత్తనాలు కుళ్లిపోయి మొలకెత్తడం లేదన్నారు. ఈ పరిస్థితులలో రైతులు, కౌలు రైతులు దిక్కుతోచని పరిస్థితులలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం క్షేత్ర పరిశీలన చేసి పంటను పరిశీలించి, నష్టపరిహారాన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా మినుము, పెసలు విత్తనాలను రైతులకు, కౌలు రైతులకు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి.శ్యాంసన్, బి.ప్రకాశరావు, పి.లక్ష్మణరావు, మావే మస్తాన్రావు, గట్టా నరసింహారావు, కె.రాంబాబు, బండి వీరయ్య, ఎం.పుష్పారావు, బోగాది నాగేశ్వరరావు, ఎం.మురళి తదితరులు పాల్గొన్నారు

విజ్ఞాన కేంద్రానికి కుట్టు మిషన్లు అందజేత

ప్రజాశక్తి-ఉయ్యూరు

రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నాగళ్ళ రాజేశ్వరమ్మ జానకి రామయ్య విజ్ఞాన కేంద్రానికి



కుట్టు మిషన్లు అందజేస్తున్న రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు

ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. శిక్షణ శిబిరంలోని మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు సిహెచ్ టి వెంకటేశ్వరరావు కోరారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు సిహెచ్ వాణి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరంలో అందరికీ ఉపయోగపడే విధంగా తమ వంతు చేయూతని అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రమోహన్, బిట్రా రామమోహనరావు, ఉమామహేశ్వరరావు, కె.వై.కె.రెడ్డి, కె.శివ నాగేంద్రం, బి.రాజేష్, బి.కీర్తి, ఎన్.గోపాల్, విపుల కుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

17న పెన్షన్ డే

ప్రజాశక్తి-గన్నవరం

పెన్షన్ డే సందర్భంగా ఈ నెల 17న గన్నవరంలోని బుద్దవరం రోడ్డులోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో సమావేశాన్ని ఏర్పాటుచేస్తున్నామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆవుటపల్లి మోహనరావు తెలిపారు. గన్నవరం సబ్ ట్రెజరీ పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు. 75 సంవత్సరాలు నిండిన రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం జరుగుతుందని తెలిపారు.



ఎడ్ల బల ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ: టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకల్లో భాగంగా గురువారం నందిగామలో జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన (బండలాగుడు) పోటీలను మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. స్థానిక జాతీయ రహదారి చందాపురం బైపాస్ పక్కన జరుగుతున్న ప్రదర్శనలో రైతులతో మాట్లాడి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. ఆయన శతజయంతి ఉత్సవాల సందర్భంగా సాంప్రదాయంగా వస్తున్న ఎద్దుల పోటీలు నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. ఐదు రోజుల పాటు జరగనున్న ఎద్దుల పోటీల్లో మొదటి రోజు పాలపళ్ల పోటీల విభాగంలో ఎద్దులను బరిలోకి దించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దేవినేని ఉమామహేశ్వరరావు, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : ఉమా

ప్రజాశక్తి:రెడ్డిగూడెం: వర్షాలకు తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని చూసి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారని, పంటను సకాలంలో కొనుగోలు చేసి వారికి సొమ్ములు



చెల్లించలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ గురువారం కూనపరాజుపర్వ గ్రామంలో ధాన్యం కల్లాల వద్ద నిరసన తెలిపారు. మద్దతు ధరతో వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామాల్లో 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలను ఏ రకంగా మోసం చేస్తున్నారో వివరించి, రచ్చబండ నిర్వహించారు. అనంతరం ఉమా మాట్లాడుతూ 72 శాతం పనులు పూర్తి చేసిన పోలవరం ప్రాజెక్టును పట్టించుకోవడంలేదన్నారు. పరిపాలన చేతకాని అసమర్ధుడికి అధికారం ఇస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు



తెలుగు వారందరికీ చిరస్మరణీయుడన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి టిడిపి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా, పట్టణ అధ్యక్షులు మేకా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పేరం సైదేశ్వరరావు, ఇర్రి నరసింహారావు, గొట్టే నాగరాజు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని జగ్గయ్యపేట ఎస్ఐ బాకీ వెంకట రామారావు ప్రారంభించారు.

ఘనంగా మెగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: మానవాళి రక్షణార్థం మానవుడిగా క్రీస్తు అవతరించిన రోజే క్రిస్మస్ పర్వదినమని విజయవాడ కతోలిక పీఠఘం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు అన్నారు. పటమటలోని నిర్మలా కాన్వెంట్ వద్ద గల సెయింట్ పాల్స్ కథెడ్రల్ ప్రాంగణంలో గురువారం సాయంత్రం ది ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చర్చెస్, ఫాదర్ మువ్వల ప్రసాద్ ఆధ్వర్యంలో ఐక్య క్రైస్తవ మెగా క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. ఈసందర్భంగా బిషప్ రాజారావు మాట్లాడుతూ సేవకుడిగా ఏసుప్రభువు ప్రజలకు దగ్గరయ్యారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషణ్ ఆఫ్ చర్చెస్ అధ్యక్షులు ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో క్రైస్తవ సంస్థల పాత్ర శ్లాఘనీయమని తెలిపారు. కొంతమంది క్రైస్తవ వ్యతిరేక శక్తులు బలవంతపు మత మార్పిడులకు క్రైస్తవ సంస్థలు పాల్పడుతున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, అటువంటి ఆరోపణలు ఐక్యంగా క్రైస్తవులు తిప్పికొట్టాలనిపిలుపునిచ్చారు. మరనాత సంస్థ కన్వీనర్ డాక్టర్ ఫాస్టర్ విశ్వ ప్రసాద్, ఏపీఎఫ్‌సి అధ్యక్షులు పాస్టర్ పాకలపాటి



ప్రభాకరరావు, సిఎస్ఐ ప్రతినిధి పాస్టర్ ఇందుపల్లి కరుణానిధి, మన్నా మినిస్ట్రీస్ బిషప్ రెవరెంట్ సజ్జనరాజు, బిషప్ రక్షణానందం, ఏపీ మైనార్టీస్ కమీషన్ వైస్ ఛైర్మన్ డాక్టర్ జాషువా డానియేలు తదితరులు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. అంతకుముందు బిషప్ జోసెఫ్ రాజారావు ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆలపించిన క్రిస్మస్ గీతాలు ఆకట్టుకున్నాయి.

నల్లతామర పురుగు నివారణపై అవగాహన



విజయవాడ: గొల్లపూడిలోని పిఐ ఇండస్ట్రీస్ ప్రాంగణంలో ఆపరేషన్ నల్ల తామర పురుగు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐటీసి లిమిటెడ్ క్రాప్ డెవలప్మెంట్ అండ్ ప్రొక్యూర్మెంట్ మేనేజర్ వై.అమరేందర్ తెలిపారు. దీనిలో భాగంగా గొల్లపూడికి చెందిన రైతు వి.బాజీరావు మిరప పొలంలో జరిగిన రైతుల సమావేశంలో జోధ్పూర్లోని సౌత్ ఏషియా బయోటెక్నాలజీ సెంటర్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ భగీరథచౌదరి మాట్లాడుతూ ఎపిలో నల్ల తామర పురుగు నివారణకు రైతులకు ఐపిఎం ఆధారిత పద్ధతులు సహాయపడతాయన్నారు. పిఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మార్కెటింగ్ మేనేజర్ టి.రవీంద్ర మాట్లాడుతూ నల్ల తామర పురుగు నివారణకు ప్రస్తుతం లభ్యమయ్యే టెక్నాలజీ, పురుగుమందులు, భవిష్యత్తులో రాబోయే కొత్త టెక్నాలజీ గురించి వివరించారు. నల్ల తామర పురుగు నివారణలో మిరప రైతులకు సహాయం చేయడానికి, దక్షిణాసియా బయోటెక్నాలజీ కేంద్రం, పిఐ ఫౌండేషన్‌లో కలిసి ఐపిఎం ఆధారిత పద్ధతులను ప్రదర్శించడానికి 'ఆపరేషన్ నల్ల తామర పురుగును'ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ శివరామిరెడ్డి, డాక్టర్ అప్పలరాజు అన్నెపు, లోకేషన్ ట్రయల్ మేనేజర్ మురళి, ఐటీసి లిమిటెడ్‌కు చెందిన డాక్టర్ సునీల్, ప్రొఫెసర్ పి.బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ రమణ నరవ, డాక్టర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లీఫ్‌తో హెచ్‌డిఎఫ్‌సి ఒప్పందం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

రైతులకు ప్రయోజనం అందించాలనే ఉద్దేశ:తో అగ్రో ప్రాసెస్ సంస్థ లీఫ్‌తో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు లీఫ్ సంస్థ ప్రతినిధి రామ్ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు విశిష్టత, బ్యాంకు సేవలు ఇతర సదుపాయాలను రైతులకు పూర్తిస్థాయిలో తెలియచేయడంతో పాటు బ్యాంకు ఏవిధంగా రైతులకు ఉపయోగపడుతుందో ఈకార్యక్రమం ద్వారా రైతులకు అవగాహణ కల్పించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా బ్యాంకు లీఫ్ రైతుల నెట్‌వర్క్‌తో పనిచేస్తుందన్నారు. రైతులకు, రైతు ఉత్పత్తిదారులకు ఆర్థిక స్వావలంబన అందించేందుకు కూడా సహకరిస్తుందని తెలిపారు.

రేపటి నుండి ఐకాన్ సైన్స్ ఎక్స్‌పో

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతన వెలికితీసేందుకు సీతారాంపురంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో 'ఐకాన్ సైన్స్ ఎక్స్‌పో-2022' నిర్వహిస్తున్నామని స్కూల్‌చైర్మన్ కె.రాజేంద్ర తెలిపారు. ఏలూరు రోడ్డులోని పాఠశాలలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17 నుండి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు సైన్సు ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. శనివారం సాయంత్రం 4.30 గంటలకు ప్రదర్శన ప్రారంభించనున్నట్లు తెలిపారు. సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థుల్లో శాస్త్రీయతను మెరుగుపరడచంతో పాటు విద్యార్థులకు సబ్జెక్టుతో పాటు జనరల్ నాలెడ్జిని కూడా పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలతిపారు. సాంకేతికత, అంతరిక్షం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, వైద్యం, వ్యవసాయం, కాలుష్యం వంటి అనేక ప్రస్తుత సమస్యలకు సంబంధించి సైన్స్‌లోని వివిధ అంశాలు నమూనాలతో సహాయంతో తమ విద్యార్థులు ప్రదర్శించనున్నారని తెలిపారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవం సోమవారం సాయంత్రం 4.30 గంటలకు జరుగుతుందని తెలిపారు.

హెచ్‌సిజితో కేన్సర్ సెంటర్‌తో ఒప్పందం

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్శిటీ: క్యాన్సర్ వైద్య పరీక్షలను నిర్వహించేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం నగరంలోని హెచ్‌సిజి క్యాన్సర్ హాస్పటల్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు హాస్పటల్ సీవోవో రవికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పందంలో భాగంగా ప్రజలకు అవసరమైన వారికి తమ హాస్పటల్‌లోని నిపుణులైన వైద్య సిబ్బంది వైద్య పరీక్షలను నిర్వహించడంతో పాటు తగిన విధంగా వైద్య సేవలను కూడా అందించనున్నారని తెలిపారు. హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్ సర్జికల్ అంకాలజీ, రోబోటిక్ సర్జరీ డైరెక్టర్ డాక్టర్ విశాల్‌రావు సమక్షంలో ఈ అవగాహనా ఒప్పందం జరిగినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో క్యాన్సర్ వైద్య సేవలను, అందించే నిపుణులు, పేషంట్ రేషియో మధ్య ఉన్న అంతరాలను తగ్గించేందుకు తమ హస్పటల్ బృందం కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో



ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ గోపీ చంద్‌తో పాటు వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడుదల రజని, ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ కుమార్ కూడా ఉన్నారని తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-కంచికచర్ల: పేరకలపాడు గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలను గ్రామ సర్పంచ్ మన్నే సాత్విక గురువారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, విద్యా బోధన, మధ్యాహ్న భోజన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. మెనూ ప్రకారం ప్రతి రోజూ మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: ముచ్చినపల్లి ఆర్బికెలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇటీవల శ్రీరాంపురం సర్పంచ్ శ్రీనివాసరావు ప్రారంభించగా గురువారం నాటికి 43 మంది రైతులకు చెందిన 2800 క్వింటాళ్ల ధాన్యం కోనుగోలు చేసినట్లు సోసైటీ అధ్యక్షులు నాదెళ్ల చెన్న కేశవరావు, సర్పంచ్ శ్రీనివాసరావు తెలిపారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేలా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు, జడ్పీటీసీ సభ్యులు విజయభాస్కరరెడ్డి ప్రతేక శ్రద్ద తీసుకుంటున్నట్లు తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-మైలవరం: విద్యార్థులు మహనీయుల చరిత్రను తెలుసుకొని వారిని ఆదర్శంగా తీసుకోవాలని మాజీ సిబిఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మైలవరం సాయిబాబా కళ్యాణ మండపంలో వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జీవిత కథలను ప్రతిఒక్కరు చదివి ఉత్తేజం పొందాలన్నారు. మనిషి తన గొప్పతనం గురించి తాను తెలుసుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఏకగ్రతను ఎలా పొందాలి ధైర్యంగా సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అనే విషయాలను వివరించారు.

ఒత్తిడిని అధిగమించాలి

ప్రజాశక్తి-తిరువూరు: ప్రతి విద్యార్థి సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ, మానసిక ఒత్తిడిని అధిగమించడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చని డాక్టర్ పి.కల్యాణి విద్యార్థులకు సూచించారు. మండలంలోని గానుగపాడు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. కరోనా అనంతరం విద్యార్థులు పూర్తి స్థాయిలో పరీక్షలకు సిద్ధమౌతున్న తరుణంలో ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని జి.ఆదిలక్ష్మి, పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని 31వ వార్డు పుట్టబజార్‌లో పైప్‌లైన్ నిర్మాణ పనులకు గురువారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైసిపి యువజన నాయకులు సామినేని వెంకట కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సిలర్ గింజుపల్లి వెంకటరావు ద్వారా సమస్య తెలియడంతో పైపుల నిర్మాణ పనులు ప్రారంభించనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వట్టెం మనోహర్, పందుల రోశయ్య, భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.